

వైసీపీ యువ నాయకుడి
వీరంగం

హిందూపురంలో ఇనుపరాడ్‌తో హల్‌చల్

టీడీపీ సానుభూతిపరుడిని చంపేస్తానంటూ బెదిరింపు

పోలీసుల అదుపులో వాల్మీకి లోకేష్



మోహన్ ఇంటివద్ద ఇనుప రాడ్‌తో వాల్మీకి లోకేష్

హిందూపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో వైసీపీ యువ నాయకుడు, జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ వాల్మీకి లోకేష్ ఇనుప రాడ్‌తో వీరంగం చేశాడు. అందుకు సంబంధించిన వీడియో ఆదివారం వెలుగులోకి వచ్చింది. హిందూపురంలోని దండు రోడ్డులో నివాసముంటున్న టీడీపీ సానుభూతిపరుడు మోహన్.. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశాడంటూ అదే ప్రాంతానికి చెందిన వాల్మీకి లోకేష్ వీరంగం చేశాడు. శనివారం సాయంత్రం ఇనుపరాడ్‌తో మోహన్ ఇంటివద్ద హల్‌చల్ చేశాడు. మోహన్ కుటుంబ సభ్యులపై దురుసుగా, పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడాడు. మోహన్ కనిపిస్తే హతమారుస్తానని బెదిరించాడు. అందుకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోహన్ కుటుంబ సభ్యులు కూడా తమకు ప్రాణహాని ఉందని ఆందోళనవ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం లోకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హంగామాపై అనుమానాలు..

వాల్మీకి లోకేష్ గతేడాది ఎన్నికలకు ముందు కూడా టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నానికి పాల్పడటంతో కేసు నమోదైంది. ఎన్నికల అనంతరం కూడా సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టు చేశారని పోలీసులు విచారించారు. ఈ నేపథ్యంలో శనివారం రాడ్‌తో హల్‌చల్ చేశాడు. లోకేష్ హంగామాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాడ్ పట్టుకుని హల్‌చల్ చేసిన వీడియో తీసింది ఆ యువ నాయకుడి అనుచరుడేనని తెలిసింది. పబ్లిసిటీ కోసమే ఇలా చేశాడా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది.



ధర్మవరం ఆర్టీసీ బస్టాండులో బస్సులు



పల్లెకు చేరని ఆర్టీసీ సర్వీసులు

ఇంకా మెరుగుపడని రవాణా

- వైసీపీ హయాంలో రోడ్లు అస్తవ్యస్తం
- అప్పట్లో గ్రామాలకు సర్వీసుల నిలిపివేత
- పునరుద్ధరించాలని గ్రామీణుల వినతి

ఆటోలే గతి

గాండ్లవారిపల్లి నుంచి ముదిగుబ్బకు వెళ్లాలంటే 13 కిలోమీటర్లు దూరం ఉంది. 2010 వరకు హిందూపురం డిపో నుంచి ముదిగుబ్బకు వచ్చి దొరిగిల్లు వరకు సాయంత్రం వరకు నడిచి తిరిగి వెళ్లేది. తరువాత ఆ బస్సును రద్దుచేశారు. అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే ఆటోలో దిక్కు. ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలి. ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ మా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చూస్తామన్న ఆలోచన చేసేవారే లేరు.



-బాలరాజు, గాండ్లవారిపల్లి, ముదిగుబ్బ మండలం

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొత్త బస్సులు తెస్తున్నాం.. రవాణా సౌకర్యాన్ని మారుమూల గ్రామాలకూ విస్తరిస్తున్నాం అంటూ ఓ వైపు ఆర్టీసీ అధికారులు ప్రకటనలు చేస్తున్నా అవి ఆచరణలోకి రాలేదు. గ్రామీణులకు ఆటోలు, ఇతర వాహనాలే దిక్కుగా మారాయి. గ్రామీణ ప్రాంతాలకు రహదారి సదుపాయం కలుగుతున్నా.. ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణ కాలేదు. జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, కదిరి, హిందూపురం డిపోల పరిధిలో ఆర్టీసీ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత బస్సుల సంఖ్య పెరిగినా గ్రామీణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంలేదు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్లక్ష్యం చేసింది. పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితం చేసింది. పక్కా రహదారులు ఉన్నా ఆర్టీసీ అధికారులు సర్వీసులు తిప్పడం లేదు. దీంతో గ్రామీణులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ప్రైవేటు వాహనాలే దిక్కవుతున్నాయి.

గ్రామాలకు వెళ్లని బస్సులు

జిల్లాలో ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరిలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 400 బస్సులు ఉన్నాయి. అద్దె బస్సులు 110 దాకా నడుస్తున్నాయి. వీటిలో కాలం చెల్లిన బస్సులు కూడా ఉన్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలకు గ్రామీణ సర్వీసులు నడుస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బస్సులు వెళ్లడం లేదు. జిల్లాలో అన్ని డిపోల పరిధిలో రోజూ లక్షా 10 వేల కిలో మీటర్ల మేరకు తిరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు సగటున రూ.40 లక్షల దాకా ఆదాయం సమకూర్చుతున్నట్టు ఆర్టీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది. సేవలను మారుమూల గ్రామాలకు మరింతగా విస్తరిస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో అన్ని మండలాలను కలుపుతూ లింకు రహదారులు ఉన్నాయి. వీటిని కలుపుతూ ఆర్టీసీ గ్రామీణ సర్వీసులు నడిపితే ప్రజలకు ఉపయోగకరం. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులు దారుణంగా ఉండడంతో బస్సులు వెళ్లలేని దయనీయ స్థితి. ప్రజలు ప్రైవేటు వాహనాలవైపే మొగ్గుచూపుతూ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కకపోవడంతో కలెక్షన్ రాలేదని అందుకే కొన్ని గ్రామాలకు సర్వీసులు నిలిపివేశామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు రహదారులు మెరుగైనా బస్సులను పునరుద్ధరించలేదు. ప్రధాన రహదారి వెంబడి ఉన్న గ్రామాలకు కొంత సౌకర్యంగా ఉన్నా అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఆరు డిపోలలో ఎక్స్‌ప్రెస్‌లే అధికం. పల్లెవెలుగు బస్సులు చాలా తక్కువగా ఉన్నాయి. సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరకొరగానే సర్వీసులు

మాది రావులచెరువు పంచాయతీలోని ఎన్ఆర్ కొట్టాల గ్రామం.ప్రతి రోజూ ఏదో పనిమీద పట్టణానికి వెళ్లాల్సిందే. ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు. మాకు ఆటోలే దిక్కు. అవికూడా ఓవర్‌లోడ్‌తో వస్తుంటాయి. ప్రమాదమని తెలిసినా తప్పక వెళ్లాల్సిందే. ధర్మవరం-ముదిగుబ్బ సర్వీసు ఉదయం, సాయంత్రం మాత్రమే వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి మధ్యాహ్నా సమయంలో కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.



- శేషు, ఎన్ఆర్ కొట్టాల, ధర్మవరం మండలం

అరటి తోటల మధ్యలో రేషన్ బియ్యం డంప్

- సీజ్ చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు

7



గీతాలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

ఉత్సాహంగా కేరళ నూతన సంవత్సర
వేడుకలు



ప్రసంగిస్తున్న జ్యోతిలాల్

పుట్టపర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కేరళ నూతన సంవత్సర వేడుకలను ఆ రాష్ట్ర భక్తులు ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో కేరళ విషు వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి జ్యోతిలాల్ సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు, సేవలపై ప్రసంగించారు. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు భక్తులను ప్రేమతత్వం వైపు పయనించేలా చేస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వాయిలెన్ వాయిద్యా కళాకారులు సురేశ్, దీక్షిత్ బృందం నాదంతో భక్తులను తన్మయం చేశారు. కేరళ యువత సత్యసాయి ప్రేమతత్వంపై గంటపాటు భక్తిగీతాల ఆలాపన చేసింది. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఆ రాష్ట్ర భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న భక్తులు

నిద్రమత్తులోనే ప్రమాదాలు

వేకువజామునే అధికం

- అతివేగమే కారణం
- ఏడాదిలో ఆరు ఘటనలు
- 11 మంది మృత్యువాత



హిందూపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిద్ర మత్తు, అతివేగంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆ జాతీయ రహదారి ఏర్పాటైన తరువాత ఒకే ప్రాంతంలో అధిక శాతం వేకువజామున ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నాయి. ఓ వైపు నిద్ర మత్తు, మరో వైపు అతివేగమే ప్రమాదాలకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిర 544-ఇ జాతీయ రహదారిలో పరిగి మండల పరిధిలో పైడేటి సర్కిల్ నుంచి ధనాపురం క్రాస్ మధ్యనే అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి 2023లో ఏర్పాటైన తరువాత కిలోమీటరు వ్యవధిలోనే 20 దాకా ప్రమాదాలు జరిగాయి. ఇందులో 16 మంది మృతి చెందగా.. 10 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఏడాదిలోనే ఆరు ప్రమాదాలు జరిగి 11 మంది మృత్యువాత పడ్డారు.

వేకువజామునే ప్రమాదాలు అధికం

ధనాపురం నుంచి పైడేటి సర్కిల్ వరకు తెల్లవారుజామునే ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల రికార్డులను బట్టి తెలుస్తోంది. ఇందుకు ఏడాదిలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే.. ఆరు ప్రమాదాలకు గాను.. ఐదు ప్రమాదాలు అర్ధరాత్రి నుంచి తెల్లారిలోపే జరిగాయి. తొమ్మిది నెలల క్రితం ఓ పరిశ్రమలో పని ముగించుకొని మడకశిర వైపు వెళుతుండగా అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. ఏడు నెలల క్రితం బెంగళూరు నుంచి ఓ యువకుడు పావగడకు వెళుతూ ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఏడు నెలల క్రితం కారులో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరు మృతి చెంది, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో రెండు మూడు ప్రమాదాలు కూడా అర్ధరాత్రి దాటాకే జరిగినట్లు తెలుస్తోంది.

అతివేగమే కారణం

సాధారణంగా బెంగళూరు లేదా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటుతుంది. దీంతో పాటు కొడికొండ చెక్‌పోస్టు నుంచి మడకశిర వరకు మధ్యలో ఎక్కడా టీ స్టాళ్లు, హోటళ్లు లేవు. దీంతో డ్రైవర్లు వాహనం ఆపకుండా ప్రయాణం చేస్తుంటారు. ఈ సందర్భంలో నిద్రమత్తు ఉంటారు. మరో వైపు జాతీయ రహదారి కావడంతో రాత్రి సమయంలో ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది. దీంతో వాహన డ్రైవర్లు అతి వేగానికి ఇష్టపడతారు. ఇలాంటి సందర్భంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ తరుణంలో అర్ధరాత్రిదాటాక పోలీసులు ఉండి వాహనాలు తనిఖీ చేసి గంట పాటు వాహనాలు ఆపి వెళ్లేలా చేస్తే ప్రమాదాలు నివారించవచ్చు. ఆ దిశగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెండు రోజుల క్రితం కూడా పరిగి మండల కేంద్రంలో ఓ కారు గుడిసె వైపు దూసుకెళ్లి ఒకరు మృతి చెందారు.

వేగనియంత్రణ చర్యలు తీసుకుంటాం

పరిగి మండల పరిధిలో ఉన్న జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. అధికారులతో మాట్లాడి ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం. రాత్రి సమయంలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేస్తాం. **-రంగడుయాదవ్, ఎస్ఐ**

తెల్లారిన బతుకులు..

ఆలయానికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు..

ఆగివున్న ఆటోను ఢీకొన్న కంటైనర్

ముగ్గురు మహిళల దుర్మరణం

11 మందికి గాయాలు

కన్నీళ్లు పెట్టుకున్న దొడగట్ట



ప్రమాదానికి కారణమైన కంటైనర్

మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి తీసుకెళ్తున్న ఎస్ఐ రంగడు యాదవ్



చైత్ర పౌర్ణమి.. ఒకే ఊరికి చెందినవారు
ఆటోలో ఆలయానికి వెళ్లారు.. అక్కడే జాగారం చేశారు..
తెల్లవారుజామున నిద్రలేచి.. ఊరికి పయనమయ్యారు..
ఆటోలోనే కునుకు తీస్తున్నారు.. డ్రైవర్ రోడ్డు పక్కన ఆటో ఆపి..
నీటితో మొహం కడుక్కుంటున్నాడు..
నిముషంపాటు ప్రయాణించి ఉండుంటే..
జాతీయ రహదారి వదిలి.. ఊరి దారికి మళ్లేవారు..
ఇంతలోనే మృత్యువు దూసుకొచ్చింది..
అతివేగంతో వచ్చిన కంటైనర్ రెప్ప పాటులో ఢీకొట్టింది..
ఆటో రోడ్డు పక్కనున్న ముళ్ల పొదల్లోకి వెళ్లింది..
అందులోని వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు..
ముగ్గురు నిర్జీవంగా పడి ఉన్నారు..
కొందరు స్పృహ కోల్పోయి ఉన్నారు..
ఇంకొందరు ఆర్తనాదాలు పెడుతున్నారు..
నిరుపేద కుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది.

7

రోడ్డు ప్రమాదంలో
ఉపాధ్యాయురాలి మృతి

- భర్త, కుమార్తెకు తీవ్రగాయాలు
- చిత్తూరు జిల్లా పుంగనూరు సుగాలి మిట్ట వద్ద ప్రమాదం

7

రేపట్నుంచి సప్లిమెంటరీ ఫీజు చెల్లించవచ్చు

కొత్తచెరువు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 15వతేదీ నుంచి ఫీజులు చెల్లించవచ్చని డీఐఈఓ రఘునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 12 వతేదీ నుంచి 20వతేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. నిర్ణీత తేదీల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2-30 గంటల నుంచి 5-30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 22వ తేదీ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు.

జవాబు పత్రాల రీవెరిఫికేషన్ కోసం రూ.1300, రీ కౌంటింగ్ కోసం రూ.260 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సప్లిమెంటరీ పరీక్షా ఫీజు జనరల్, ఒకేషనల్ సబ్జెక్టులకు రూ.600, ప్రాక్టికల్స్‌కు, జనరల్‌కు రూ.275, జనరల్ బ్రిడ్జి కోర్సులకు రూ.165, బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్స్ కోసం రూ.275 చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

వృద్ధుడికి ఆశ్రయం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆలపాలన చూసేవారు లేని ఓ వృద్ధుడికి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి ఆశ్రయమిచ్చారు. నల్లచెరువు మండలానికి చెందిన గంగులప్ప అనే వృద్ధుడు నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆలనాపాలన చూసేవారు లేకపోవడంతో నల్లచెరువుకు చెందిన కొంతమంది అతడిని ఆదివారం అమడగూరు మండల కేంద్రంలో వదిలేసి వెళ్లారు. విషయాన్ని స్థానికులు వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి సమాచారం ఇచ్చారు. ఆమె వృద్ధుడిని ఆశ్రమానికి తీసుకెళ్లి సపర్యలు చేశారు.



వృద్ధుడికి చేయూతనిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి

నేటి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దుచేసినట్లు ఎస్పీ రత్న ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

తెల్లారిన బతుకులు..

హిందూపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం ధనాపురం క్రాస్ సమీపంలో కొడికొండ చెక్‌పోస్టు-శిర జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున రోడ్డు పక్కన ఆగివున్న ఆటోను వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు మహిళలు మరణించగా.. 11 మంది గాయపడ్డారు. పరిగి ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన 13 మంది భక్తులు గోనిమేకలపల్లికి చెందిన బాబు ఆటోలో శనివారం సాయంత్రం 7.30 ప్రాంతంలో బయలుదేరి హిందూపురం మండలంలోని కొటిపికి వచ్చారు. అక్కడున్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జాగరణ చేసి తెల్లవారుజామున 4.30గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యారు. సుమారు 5.00 గంటల సమయంలో ధనాపురం క్రాస్ వరకు ఆటో వెళ్లింది. ఆటోలో ఉన్నవారంతా నిద్రిస్తున్నారు. దీంతో ఆటో డ్రైవర్ మొహం కడుక్కునేందుకు వాహనాన్ని రోడ్డుపక్కన ఆపాడు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొని వెళ్లిపోయింది. ఆటో కంపచెట్లలో ఎగిరిపడగా.. అందులో ఉన్న దొడగట్టకు చెందిన ఉప్పర వెంకటరాముడు భార్య ఉప్పర అలివేలమ్మ(40), ఉప్పర దాసన్న భార్య ఉప్పర సాకమ్మ(70), బోయ రామాంజినప్ప భార్య బోయ ఆదిలక్ష్మమ్మ(60) దుర్మరణం చెందారు. అందులో ప్రయాణిస్తున్న అంజినరెడ్డి, అతడి భార్య ప్రమీల, పాపమ్మ, విజయ్, ఆటో డ్రైవర్ బాబు, చిన్నారులు అభినవ్, అనిల్‌కుమార్, అంజినమ్మ, రూప, యశ్వంత్‌రెడ్డి, సుజాత గాయపడ్డారు. స్థానికులు.. పరిగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిగి ఎస్ఐ రంగడు యాదవ్, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో అంజినరెడ్డి, అతడి భార్య ప్రమీల పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. మృతిచెందిన అలివేలమ్మకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఆదిలక్ష్మమ్మకు భర్త, ముగ్గురు పిల్లలున్నారు. సాకమ్మకు ఎవరూలేరు. మృతిచెందినవారు కూలి, వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవారు.

బెంగళూరులో కంటైనర్ పట్టివేత

ఆటోను ఢీకొని వెళ్లిపోయిన కంటైనర్‌ను మొదట గుర్తుతెలియని వాహనంగా పరిగణించారు. పోలీసులు ఆ రహదారిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బెంగళూరులో వాహనాన్ని గుర్తించారు. వాహనం పార్శిల్ సర్వీస్ బెంగళూరు నుంచి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా మడకశిర, పావగడ వెళ్తోంది. ప్రమాదం జరగడంతో వారు నేరుగా బెంగళూరు వెళ్లారు. పోలీసులు వాహనాన్ని గుర్తించి, పరిగి స్టేషన్‌కు తీసుకొచ్చారు.

సీఎం, మంత్రుల దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రమాదంపై ఆరా తీశారు. జిల్లాకు చెందిన పెనుకొండ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. బాధితుల కుటుంబాలను ఫోన్‌లో పరామర్శించారు. ఎంపీ బీకే పార్థసారధి హిందూపురం ఆస్పత్రిలో మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. గాయపడిన వారిని పరామర్శించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పందించారు. తన వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుకు ఫోన్‌చేసి, వారిని ప్రభుత్వాస్పత్రికి పంపించారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

వైద్యుల అలసత్వంపై ఆగ్రహం

ఘోర రోడ్డు ప్రమాదం జరిగి గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తే అరగంటపాటు వైద్యులు రాకపోవడంతో టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌ఓలను ఫోన్‌లో సంప్రదించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

దొడఘట్టలో విషాదఛాయలు



అలివేలమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులంతా రొద్దం మండలం దొడఘట్టకు చెందినవారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ముగ్గురు చనిపోవడం, 10 మంది గాయపడడంతో ఆయా కుటుంబాలు కన్నీళ్లు పెట్టుకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకురావడంతో వారి కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు.



హిందూపురం ఆస్పత్రి వద్ద విషాదంలో మృతుల కుటుంబ సభ్యులు

పెనుకొండ వద్ద బీహార్ వాసి..

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపలి వద్ద జాతీయరహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో బీహార్‌వాసి మృతిచెందాడు. ఎస్ఐ రాజేష్ తెలిపిన మేరకు బీహార్‌కు చెందిన చోటా సాహ్ని(30) మూడు రోజుల క్రితం కియ పరిశ్రమలో పనికోసం వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం అమ్మవారిపల్లి నుంచి పెనుకొండ వైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా ముందు వెళ్తున్న లారీ స్పీడ్‌బ్రేకర్ వద్ద ఒక్కసారిగా స్లో చేయడంతో వెనుకే వస్తున్న చోటాసాహ్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



మృతదేహాన్ని తరలిస్తున్న ఎస్ఐ రంగడు యాదవ్

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- భర్త, కుమార్తెకు తీవ్రగాయాలు
- చిత్తూరు జిల్లా పుంగనూరు సుగాలి మిట్ట వద్ద ప్రమాదం

కదిరి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలోని సుగాలి మిట్టవద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి మండలంలోని బాలప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ శారద(45) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో ఆమె భర్త అన్నమయ్య జిల్లా సోంపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరమణ, కుమార్తె కీర్తనకు తీవ్రగాయాలైనట్లు ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి. కదిరి మండలం బాలప్పగారిపల్లిలో శారద ఉపాధ్యాయులురాలిగా పనిచేస్తోంది. ఆమె భర్త వెంకటరమణ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం సోంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వారు నూతనంగా కొనుగోలుచేసిన కారులో కుమార్తె తో కలిసి అరుణాచలం వెళ్లి స్వామివారి దర్శనాంతరం తిరిగి వస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపం సుగాలిమిట్ట వద్ద కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన భర్త, కుమార్తెను బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది. కదిరి పట్టణంలోని అడపాల వీధిలో వీరు నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉపాధ్యాయురాలి మృతిపట్ల ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



శారద (ఫైల్)





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ, కీర్తన

క్రైం కార్నర్

పాముకాటుతో రైతు మృతి

గోరంట్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీ బుడ్డపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు (52) పాముకాటుతో శనివారం రాత్రి మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. శ్రీనివాసులు కొంతకాలంగా సోమందేపల్లిలో నివాసముంటూ, బుడ్డపల్లిలో వ్యవసాయం చేస్తున్నాడు. వరి పంటకు నీరు పెడుతుండగా శనివారం పాముకాటుకు గురయ్యాడు. అనంతరం సోమందెపల్లికి వెళ్లి చికిత్స చేయించుకుని, పెనుకొండ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు చెప్పారు. శ్రీనివాసులుకు భార్య ముత్తమ్మ, కుమారుడు నవీన్, కుమార్తె రూప ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



శ్రీనివాసులు (ఫైల్)

అరటి తోటల మధ్యలో రేషన్ బియ్యం డంప్

- సీజ్ చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు



సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

యాడికి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో అరటి తోటల మధ్యలో నిల్వచేసిన 18 టన్నుల బియ్యాన్ని ఆదివారం పోలీసు, రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. అరటితోటల మధ్యలో ఉన్న బీడు పొలంలో రేషన్ బియ్యం నిల్వచేశారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. సమీపంలోని చెరకుతోట వద్ద దారి పక్కనే నిలువచేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటిని సీజ్‌చేశారు. సీజ్‌చేసిన బియ్యాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో యాడికి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎవరు నిల్వ చేశారో?

రాయలచెరువు వద్ద జాతీయ రహదారికి అరకిలోమీటర్ దూరంలో అరటి తోటల పక్కన రేషన్ బియ్యాన్ని ఎవరు నిల్వచేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. మండల, జిల్లా సరిహద్దు గ్రామానికి చెందిన వ్యక్తి రేషన్ బియ్యం వ్యాపారం చేస్తుంటాడని, అరటితోటల మధ్య నిల్వచేసిన బియ్యం అతనివే అయి ఉండవచ్చునని స్థానికులు చర్చించుకుంటున్నారు.

దేవుడితో కూడా రాజకీయాలు చేస్తారా..!

- కరుణాకర్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే..
- ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

రామగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కుల, మత, శవరాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత మండిపడ్డారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 12 మంది లబ్దిదారులకు రూ.4.63లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదప్రజల కోసం అనునిత్యం కృషిచేస్తుంటే వైసీపీ నాయకులు తమ స్వార్థంకోసం అన్నింటా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ ఎస్వీగోశాలలో వందకుపైగా గోవులు మృతిచెందాయని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన చెప్పేవన్నీ పచ్చి అబద్దాలని, అసలు ఆయనకు ఈసమాచారం ఎవరిచ్చారో చెప్పాలన్నారు. మొదటి నుంచి టీటీడీ విషయంలో వైసీపీ రాజకీయాలు చేయడం, ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తోందన్నారు. ఎక్కడ ముఖ్యమంత్రికి మంచిపేరు వస్తుందోనన్న భయంతో ఇలాంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోలేదని నిరూపించేందుకు అక్కడ టీటీడీ సిద్ధంగా ఉందని, మరి కరుణాకర్‌రెడ్డి ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. రామగిరి, చెన్నకొత్తపల్లి మండలా కన్వీనర్‌లు సుధాకర్, ముత్యాల్‌రెడ్డి, నాయకులు మాదాపురం శంకర్, శ్రీరాములు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అన్నీ అసత్య ప్రచారాలు

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు

శింగనమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగోట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. అమె మాట్లాడుతూ టీడీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయని కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గత ఐదేళ్ల గణాంకాల ప్రకారం వయసు మీదపడటం, ప్రసవ సమస్యలు, వ్యాధుల కారణంగా నెలకు 10 ఆవులు చనిపోతున్నాయని స్పష్టం చేశారు. కరుణాకరరెడ్డి విలేకరుల సమావేశంలో చూపిన ఫొటోలు గోవులకు సంబంధించినవి కావని, మరెక్కడివోనని అన్నారు. గోశాలలో 260 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఆవుల మృతి పోస్టుమార్టం రికార్డులపై అయన అబద్దపు అరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కరుణాకర్‌రెడ్డి చేస్తునన దుష్ప్రచారంపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, డేగల కృష్ణమూర్తి, జీసీ రామానాయుడు, అంగజాల రాము, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూల చంద్రమోహన్ పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం గోశాలలో ఆవులు చనిపోయాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని అదివారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ గోశాలలో వంద ఆవులు చనిపోయాయని టీటీడీ మాజీచైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ప్రచారంలో వాస్తవం లేదని మతవిద్వేశాలు రెచ్చగొట్టే విధంగా టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవతలతో సమానంగా కొలిచే గోమాతలతో కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. టీటీడీలో సమూల ప్రక్షాళన జరగాలని ఎన్నికల ముందు సీఎం బాబు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే అనేక మార్పులు చేశారని అన్నారు. టీటీడీ భక్తులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని అన్నారు. దర్శనాలు, వసతి, ఇతర సేవలపై భక్తుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారని ఎమ్మెల్యే వివరించారు.

కసాపురం ఆలయానికి కిలో వెండి వితరణ



ఆలయ సూపరింటెండెంట్‌కు వెండిని అందజేస్తున్న మౌనిక, రాకేష్

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం ధర్మవరానికి చెందిన భక్తులు కిలోవెండిని అందజేశారు. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ఎస్ మౌనిక, రాకేష్ కిలో వెండిని ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. పండితులు వీరి పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశ్వీదించారు.

తిరుపతి ప్యాసింజరు ఆలస్యం

గుంతకల్లు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి-గుంతకల్లు ప్యాసింజరు (నం.57403) రైలు ఆదివారం రెండు గంటల ఆలస్యంగా చేరింది. ఈ రైలు 12-50 గంటలకు అనంతపురానికి సరైన సమయంలో చేరినా వెంకటాంపల్లి, గూళ్ళపాళ్యం స్టేషన్లలో ఆపేసిన కారణంగా ఆలస్యమైంది. ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్ల ట్రాఫిక్ కారణంగా ప్యాసింజరు రైలును నిలిపేసినట్లు సమాచారం. కాగా గుంతకల్లు-కల్లూరు సెక్షన్‌లో పనుల కారణంగా ఆలస్యంగా రైలు నడచినట్టు అనధికారికంగా తెలిసింది. ప్యాసింజరును నిలిపేసిన సమయాల్లో ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లు నడచినట్టు ప్రయాణికులు తెలిపారు. వెంకటాంపల్లి స్టేషన్‌లో గంట, గూళ్లపాళ్యం స్టేషన్‌లో గంటసేపు రైలును ఆపినట్లు ప్రయాణికులు వివరించారు. ఈ కారణంగా మధ్యాహ్నం 3-30 గంటలకు రైలు గుంతకల్లు స్టేషన్‌కు రావాల్సి ఉండగా, సాయంత్రం 5-40 గంటలకు చేరింది.

కరుణాకర్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీటీడీపై పనిగట్టుకుని కుట్రపూరితంగా దుష్ప్రచారం సాగిస్తున్న కరుణాకర్‌రెడ్డిపై క్రిమినల్‌కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తుల ఆదరాభిమానాలతో వెలుగొందుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రను దెబ్బతీయడానికి వైసీపీ నాయకులు పనిగట్టుకుని దుష్ప్రచారం సాగిస్తుండడం బాధాకరమన్నారు. అత్యంత ప్రాచీనమైనది హైందవ మతమన్నారు. దేవుడిపై నమ్మకం, భక్తి ఉన్నవారు దైవారాధన చేస్తుంటారన్నారు. అలాంటి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి టీటీడీ నడుపుతున్న గోశాలపై పనిగట్టుకుని దుష్ప్రచారం సాగించడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ముసుగులో ఉండే కరుణాకర్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి లాంటి వారు అటూ ఇటూ కాని హిందూవులని విమర్శించారు. ఇళ్లలో క్రైస్తవ మతాన్ని ఆచరిస్తుంటారన్నారు. ఎవరి భక్తి వారిదన్నారు. లోపల ఇతర రంగు ముసుగు వేసుకొని బయటకు వచ్చి హిందూవులను మభ్యపెట్టడానికి సాగిస్తున్న రాజకీయకుట్రలు భక్తులకు తెలిసిపోతున్నాయన్నారు. కరుణాకర్‌రెడ్డిని కఠినంగా శిక్షించినపుడే మరొకరు దేవదేవుని జోలికి వెళ్లరన్నారు. హిందువుగా నేను గర్వపడుతూ తన మతాన్ని ప్రేమిస్తూ ఇతర మతాలను గౌరవిస్తానన్నారు. అటూ ఇటూ కానీ ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి దొంగభక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉండాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

వ్యభిచార కేంద్రంపై దాడి

తాడిపత్రి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో ఆదివారం వ్యభిచార కేంద్రంపై దాడిచేసి నలుగురిని అరెస్టచేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీదేవి, అంకిరెడ్డి, వెంకటరెడ్డి గన్నెవారిపల్లికాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అనకాపల్లి నుంచి మహిళలను రప్పిస్తూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహించేవారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి నిర్వాహకులతోపాటు నాగవేణి, విజయవర్ధన్‌రెడ్డి, పుష్పరాజ్‌లను అరెస్టచేసి వారివద్ద నుంచి రూ.2వేలు, సెల్‌ఫోన్‌ను సీజ్‌చేసినట్లు సీఐ తెలిపారు.

కదిరి కంపు.. కంపు..!



పోలీస్‌లైన్‌లో పేరుకుపోయిన చెత్త





అడపాలవీధి, ఎన్జీవో కాలనీకి వెళ్లే దారిలో ఉన్న చెత్తకుప్పలు

ఏ వీధిలో చూసినా చెత్తే
ఆగిన క్లాప్ ఆటోలు
రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త
దుర్వాసనతో ఇబ్బందులు
పెరిగిన దోమలు

కదిరి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాల్టీ కంపు కొడుతోంది. క్లాప్ ఆటోలు లేకపోవడంతో ఇళ్ల వద్దకు చెత్త బండ్లు రావడం లేదు. దీంతో రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్త కనిపిస్తోంది. గతంలో ఆటోల ద్వారా చెత్తను నేరుగా డంప్ యార్డుకు తరలించేవి. ప్రస్తుతం అవి లేకపోవడంతో ప్రజలు చెత్తను రోడ్లమీదే పడేస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. పట్టణంలో చెత్త కుప్పలు పెరిగి పోవడంతో దోమలు భారీగా పెరిగాయి. అసలే వేసవి కాలం కావడంతో పట్టణ ప్రజలు ఇళ్లల్లో ఉండలేక ఆరు బయటకు వస్తున్నారు. వచ్చిన వారిపై దోమలు దాడి చేస్తున్నాయి. అంతేకాకుండా ఆ చెత్త కుప్పల నుంచి భారీగా దుర్వాసన వస్తుంటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క చిన్న కాలువల నుంచి మొదలుకొని పెద్దకాలువల వరకు మురుగు ముందుకు కదలడం లేదు. కాలువలన్నీ మురుగు, మట్టి, ప్లాస్టిక్ పేపర్లతో నిండిపోయాయి. దీంతో ఇటు చెత్త, అటు మురుగుతో పట్టణమంతా కంపు కొడుతోంది.

● ఆగిన క్లాప్ ఆటోలు : మున్సిపాలిటిలో గత ప్రభుత్వం క్లాప్ ఆటోల ద్వారా ఇంటింటి వద్ద చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. అయితే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పేరుతో ఓ ప్రైవేటు సంస్థకు చెత్త సేకరించే బాధ్యతలు అప్పగించారు. వారు కదిరి మున్సిపాలిటికి సంబంధించి 15 ఆటోలను కొనుగోలు చేశారు. డ్రైవర్లను నియమించారు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఆ ఆటోలను కంతుల ప్రకారం తీసుకరావడంతో.. ఆ కంతులు కట్టక పోవడంతో వాటిని ఆ ప్రైవేటు కంపెనీ వారు తీసుకొనిపోయారు. అందులో పనిచేసిన డ్రైవర్లకు దాదాపు 15 నెలలుగా జీతాలు అందలేదు. చెత్తను సేకరించి ఆటోలు లేక పోవడంతో ఇంటింటి చెత్త సేకరణ ఆగిపోయింది.

● రోడ్లపైనే చెత్త: ఇంటింటికి చెత్తను సేకరించే ఆటోలు రాకపోవడంతో పట్టణవాసులు చెత్తను ఎక్కడ వేయాలో తెలియక వీధి చివర్లలో, ఖాళీగా ఉన్న ప్రాం తాల్లో చెత్తను వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం చెత్త సేకరణ ట్రాక్టర్లు వచ్చి వెళ్లినా.. సాయంత్రం లోపు పెద్ద చెత్త కుప్పలు తయారువుతున్నాయి. మెయిన్ రోడ్డు నుంచి అడపాలవీధికి వెళ్లే రోడ్డు వద్ద కంపు తీవ్రంగా వస్తోంది. అటుగా వెళ్లేవారు భరించలేక ముక్కులు మూసుకొని పోతున్నారు. హోటళ్లు, దుకాణాలు యజమానులు కూడా చెత్తను రాత్రుల్లో తెచ్చి వేసి పోతున్నారు.

● కదలని మురుగు: కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. అన్ని కాలువలు ప్లాస్టిక్ కవర్లు, మట్టితో నిండిపోయాయి. కాలువల్లో పూడికను తొలగించడానికి దాదాపు రూ.60 లక్షలు వచ్చినా వాటిని నామమాత్రంగానే ఖర్చు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న క్లాప్ ఆటోలు

దుర్గంధం భరించలేకున్నాం



మా ఇళ్లు బైపాస్ రోడ్డు నుంచి అడపాలవీధికి వెళ్లే ప్రాంతంలో ఉంది. ఇంటి పక్క అందరూ చెత్త వేస్తున్నారు. రెండు రోజులైనా ఆ చెత్తను తొలగించడం లేదు. దీంతో వాసన భరించలేకున్నాం. దోమలు చాలా ఎక్కువ అయ్యాయి. ఇక్కడ చెత్త వేయకుండా మున్సిపాల్టీ వారు చర్యలు తీసుకోవాలి.

-మున్నా, అడపాలవీధి

చర్యలు తీసుకుంటున్నాం

రోడ్లపై చెత్త నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. ట్రాక్టర్లు, కంప్యాక్టర్లు రిపేరీల వల్ల పని ఆలస్యం అవుతోంది. వాటిని బాగు చేయిస్తున్నాము. మురుగునీటి కాలువల్లో పూడిక తీయడానికి ప్రతి రోజు మధ్యాహ్నం వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. దోమల నివారణకు స్ప్రే చేస్తున్నాం. ఫాగింగ్ కూడా చేయిస్తాం.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

ఇంటర్‌లో బ్లూమూన్ విద్యార్థుల ప్రతిభ

కదిరిఅర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో స్థానిక బ్లూమూన్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సీఈసీలో లిఖితాబాయి 964, నజియా 947, బైపీసీలో సబహత్ 985, ఫిర్దాస్ 952, ఎంపీసీలో మైథిలీ 963, తేజశ్వనీ 960 మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు తేజవర్ధన్, భ్యునేష్, రెడ్డిమన్విత, నందిని, మేఘనా, సాధిక్, తదితరులు ప్రతిభ చాటారన్నారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.



లిఖితాబాయి నజియా సబహత్ ఫిర్దాస్ మైథిలీ తేజశ్విని

పూర్వ విద్యార్థుల సమావేశం



ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక లయోలా పాఠశాలలో 2001-2004లో చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులు, ఆ స్కూల్ అధినేత శంకర్‌నాయుడు దంపతులను ఆ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల అందజేత

తాడిమర్రి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి, మరువపల్లి గ్రామాల్లోని వారికి మంజూరైన టీడీపీ సభ్యత్వ కార్డులను ఆయా గ్రామాల నాయకులకు మండల కన్వీనర్ కూచిరాము ఆదివారం స్థానికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయి, హర్ష, పక్కీర్‌రెడ్డి, రంగయ్య, నారాయణ స్వామి, మల్లికార్జున, ప్రతాప్ పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

మానస నృత్య కళాకేంద్రానికి అవార్డులు

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మానస నృత్య కళా కేంద్ర గురువు, శిష్యబృందానికి కళాభూషణ్, అయోధ్య రామ అవార్డులు దక్కాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సిరి ఆర్ట్స్ అకాడమీ ఆదివారం నిర్వహించిన ఆలిండియా డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేశారు. ఎంపీఆర్ కృష్ణయ్య, దైవేజ్ఞ శర్మ ఈ అవార్డులను వారికి అందజేసి.. సన్మానించారు.



అవార్డులు అందుకుంటున్న గురువు, శిష్యులు

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

బత్తలపల్లి ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో మాంచు టీం, విశాల టీంల మధ్య ఆదివారం జరిగిన ఫాదర్ విన్‌సెంట్ ఫెర్రర్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగింది. మొదట విశాలా టీం 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 194 పరుగులు చేసింది. మాంచు టీం 20 ఓవర్లల్లో ఆరు వికెట్ల నష్టానికి కేవలం 155 పరుగులే చేసింది. దీంతో విశాల జట్టు 39 పరుగులతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా భరత్‌కు రూ. 1116, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా దినేష్‌కు రూ. 516, ఆర్డీటీ కోచ్ జయరాంకు రూ. 1116 పోత్సాహక బహుమతులను సీఐ ప్రభాకర్ అందజేశారు.

ఎండలు.. వేడిగాలులతో పాట్లు

కొత్తచెరువు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎండలతో పాటు వేడిగాలులూ అధికం కావడంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో ఉదయం 10 గంటలకే జనసంచారంలేక బోసిపోయింది. మండలంలో అక్కడకక్కడ వర్షాలు పడ్డా.. ఆ తేమ కాస్త ఆవిరి అయి ఉక్కపోత మరింత పెరిగింది. దీంతో జనాలు ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమానికి గ్రామాల్లో యువత, పిల్లలు బావుల్లో ఈతకు వెళ్తున్నారు.



కొత్తచెరువులో బోసిపోయిన ప్రధాన కూడలి

ఘనంగా మట్టల పండుగ

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే ఈస్టర్ పండుగలకు ముందు ఆనవాయితీగా జరుపుకునే మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం ఈత కొబ్బరి మట్టలు చేభూని ఆయా గ్రామాల్లో ఊరేగింపులు జరిపారు. మండలంలోని కర్ణాటకనాగేపల్లి కింగ్స్ చర్చి, వెంగళమ్మచెరువలోని హోలీసిటీ చర్చిల్లో ఫాదర్లు అరుణ్, మైకేల్ ఆధ్వర్యంలో ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపులు చేపట్టారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో మట్టల దినాన్ని ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు మట్టలు పట్టుకుని చర్చి చుట్టూ తిరుగుతూ హోసన్న జయమంటూ నినాదాలు చేశారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. మట్టల ఆదివారం విశిష్టతను ఫాస్టర్ డాక్టర్ రెవరెండ్‌ఎంజీ జయానందం వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



వెంగళమ్మచెరువులో క్రైస్తవుల ఊరేగింపు



ఓడీసీలో మట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

న్యూస్ బాక్స్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ముదిగుబ్బ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక దొరిగల్లు రోడ్డులో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామున అభిషేకం నిర్వహించి, పసుపు కుంకుమలతో, వివిధ పుష్పాలతో అలంకరించారు. మహిళలు ముత్యాలమ్మకు చీర, గాజులు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇస్కాన్‌లో భాగవత ప్రవచనాలు



అలంకరణలో స్వామి, అమ్మవార్ల ప్రతిమలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవ దాస్ భాగవత ప్రవచనాలు చేశారు. ముందుగా మందిరంలో కొలువుదీరిన బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలను అందంగా అలంకరించి సంకీర్తనలు చేశారు. అదేవిధంగా భక్తులు హరేకృష్ణ, హరేరామ సంకీర్తనలు చేశారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

ముదిగుబ్బ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఆదివారం ఆ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్, నాయకులు మీడియాతో మాట్లాడారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని రెండు రూపాయలు పెంచారని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన బీజేపీ.. అనంతరం ఆ హామీని విస్మరించి.. ఆ ధరలను మరింత పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిషార్ అహ్మద్, ఆదినారాయణ, అనీల్ కుమార్, రాజు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ రెడ్డప్ప ఆదివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. అవాంచనీయ సంఘటనలకు పాల్పడినా.. బెదిరించినా.. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠినంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.


అనుచిత పోస్టులు పెడితే కఠిన చర్యలు: డీఎస్పీ



ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలు, కులాలు, మతాలు మధ్య రెచ్చగొట్టే విధంగా దుష్ప్రచారం, అవాస్తవాలు, అనుచిత పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజానిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టడం షేర్ చేయడం, ప్రోత్సహించడం, సహకరించడం చట్టరీత్యానేరమన్నారు. అటువంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆకట్టుకుంటున్న కంబాలరాయుని కొండ

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని వినతి



కంబాలరాయుని కొండ

గాండ్లపెంట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలో ఉన్న కంబాలరాయుని కొండ ఆకర్షిస్తోంది. సాధారణంగా కొండలంటే చెట్లు, రాళ్లతో కనిపిస్తాయి. ఈ కొండ మాత్రం ఒకే రాయితో అర్ధచంద్రాకారంలో ఉంది. కొండపైన సమాంతరంగా దాదాపు 10 ఎకరాల విస్తీర్ణం ఉంది. వర్షాలు కురిసినపుడు ఆ కొండపై నుంచి కిందికి పారే నీటితో రాతిపై ఏర్పడిన కోతలు స్పష్టంగా కనిపిస్తాయి. కొండ కింద ప్రాంతం అంతా పచ్చదనంతో ఉండడం విశేషం. వర్షాకాలంలో కొండచుట్టు పచ్చదనంతో కలకలాడుతూ చూపరులను మరింత ఆకట్టుకుంటుంది. ఈ కొండపైకి ఎక్కితే తలుపుల, గాండ్లపెంట మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలు కనిపిస్తాయి. ఈ కొండ ప్రాంతం నుంచి కదిరి శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు గుహ ఉండేదని పూర్వీకులు చెబుతున్నారు. ప్రతి సంక్రాంతికి ఆ ప్రాంతంలో కంబలరాయుని ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. కొండపైన వెలసిన కంబలరాయునికి గుడి నిర్మించాలని, ఈ ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని చుట్టుపక్కల గ్రామాలవారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనసాగిన ముస్లింల దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ముస్లింలు

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముస్లింలు చేపట్టిన నిరాహారదీక్ష రెండో రోజైనా ఆదివారమూ కొనసాగింది. వక్ఫ్ ఆస్తులను కాపాడుకునేందుకు ఈ దీక్షలు చేపడుతున్నామన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాతకు ప్రసంశాపత్రాన్ని అందజేస్తున్న డీఎస్పీ

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో రజనీ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 28 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కన్నా వెంకటేశ్, సభ్యులు చంద్రశేఖర్, జయప్రకాశ్, ఉదయ్‌కుమార్, శంకర, నాగరాజు, విష్ణు, నరేంద్ర,శివయ్య, ప్రజాసేవకుడు కేతాలోకేశ్ పాల్గొన్నారు.

మృతురాలికి నివాళి

నల్లమాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలేటి పల్లి గ్రామానికి చెందిన శివమ్మ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళ్లు అర్పించారు.

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం ఆర్డీఓ మహేశ్

ఇంటర్వ్యూ (interview)



ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): 'ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఇంకా సమస్యలుంటే ప్రజలు నేరుగా నా ఆఫీస్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. భూ సమస్యలు చాలా ఉన్నాయి. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాం. మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి వాటిని పరిష్కరిస్తున్నాం.' అని ఆర్డీఓ మహేశ్ అన్నారు. ఆయనతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన.. ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిస్థితి ఏమిటి..?

జవాబు : చాలా అర్జీలు భూ వివాదాలవే. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచిస్తున్నా. మరికొన్ని అర్జీలను సంబంధింత అధికారులకు పంపి.. సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా వచ్చి నన్ను కలవచ్చు.

ప్రశ్న : ఎన్ని ఫ్రీహోల్డ్ భూములు సర్వే చేశారు?

జవాబు : రెవెన్యూ డివిజన్‌లో ఇప్పటి వరకు దాదాపు 82 వేల ఫ్రీహోల్డ్ భూములను సర్వే చేశాం.

ప్రశ్న : పట్టణంలోని 650-2సర్వే నెంబరులో అక్రమాలపై ఏం చర్యలు చేపట్టారు ?

జవాబు: ఇటీవల కాలంలో ఇంటి పట్టాలు అక్రమంగా చేసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్, సిబ్బందిని విచారణకు పంపాం. వారు కూడా నివేదికను తయారు చేసి ఇచ్చారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి.. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : డీలర్లకు రేషన్ తక్కువగా వస్తోందనే ఆరోపణలపై ఏమంటారు..?

జవాబు : రేషన్ తక్కువ రాలేదు. అయితే స్టోర్ డీలర్లు స్టాక్ పాయింట్‌కు వచ్చి తీసుకెళ్లాలి. అలా చేస్తే సమస్య రాదు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖర్‌నాయుడు (50) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను శనివారం ద్విచక్రవాహనంలో మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి చెరువు వద్ద వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతను అక్కడికక్కడే మరణించాడు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదివారం కమ్మవారిపల్లికి వెళ్లి.. చంద్రశేఖర్‌నాయుడి మృతదేహానికి నివాళులర్పించారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు గ్రామ వాసి బోయ హరి(27) కడుపునొప్పి తాళలేక శనివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సంవత్సరం క్రితం అతని భార్య శిరీష హరితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ గొర్రెలు, ఆవులను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దికాలంగా అతనికి కడుపునొప్పి తీవ్రమైంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరి మృతదేహాన్ని పోలీసులు ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. హరి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రి

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లి గ్రామంలో శనివారం రాత్రి అనిత ఇంట్లో విద్యుదాఘాతం జరిగింది. ఇంట్లో ఉన్న రూ. లక్ష విలువైన సామగ్రి కాలిపోయింది. అనిత మాట్లాడుతూ.. శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి.. బయటకు వెళ్లానని.. ఆ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని వాపోయారు. చుట్టుపక్కన వాళ్లు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారన్నారు. అయితే అప్పటికే ఇంట్లోని ఫ్రిడ్జ్, టీవీ, ఫ్యాన్లు, వంటసామగ్రి, సామాన్లు, బట్టలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు పునరావాసం కల్పించి కుటుంబ జీవనానికి నిత్యావసర వస్తువులు అందించాలని విజ్ఞప్తి చేశారు.

12 మందిపై కేసు

ధర్మవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 12 మంది కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆదివారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి వారిని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

చేపల తరలింపులో వివాదం

పరస్పరం కేసుల నమోదు

తాడిమర్రి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చేపల తరలింపు విషయంలో వివాదం నెలకొంది. ఆ రిజర్వాయర్‌లో అధికారికంగా చేపలు పట్టడానికి గతంలో వేలం నిర్వహించారు. అందులో ఆ హక్కు దక్కించుకున్న వారు ఆ రిజర్వాయర్‌లోని చేపలు పట్టుకొని సోమవారం నుంచి తరలించడానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఆదివారం ఐచర్ వాహనంలో ఆ రిజర్వాయర్ వద్దకు వెళ్తుండగా.. పెద్దకోట్లకు చెందిన ఆనంద్, వీరరాఘవ, ఏటుకూరు నాయుడు అడ్డుకున్నారు. వాహన డ్రైవర్ పవన్ కళ్యాణ్ వద్ద నుంచి తాళాలను బలవంతంగా లాక్కున్నారు. సమస్య రాకూడదని వారు మరో వాహనాన్ని తెప్పించుకోగా.. మళ్లీ ఆనంద్ తదితరులు అడ్డుకోవడమే కాకుండా.. తీవ్ర దుర్భాషలాడారు. దీంతో ఇరువర్గాల మధ్య దాడి జరిగింది. ఇరువర్గాల వారి పరస్పర ఫిర్యాదు మేరకు.. మొత్తం 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే పలు కార్యక్రమాల్లో తాను పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కొత్తచెరువులో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో, 9.30 గంటలకు పోతులకుంట గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటానన్నారు. అలాగే పుట్టపర్తిలోని ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహంలో నిర్వహించే అంబేడ్కర్ జయంతిలో, అమడగూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు మంచి రోజులు

మడకశిరలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి

ఈ నెలలో మంత్రి చేతులమీదుగా ప్రారంభోత్సవం

హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



నిర్మాణ పనులు పూర్తయిన ఇండోర్ స్టేడియం

మడకశిర టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గత ఏడాది రాష్ట్రంలో పాలన మారడంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు పూర్తవుతున్నాయి. అలాంటి కోవకు చెందినదే మడకశిర ఇండోర్ స్టేడియం(క్రీడావికాస కేంద్రం). వెనుకబడిన మడకశిర ప్రాంతంలో క్రీడాభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వంలో రెండు కోట్ల రూపాయలతో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. దాదాపు 80శాతం పనులు పూర్తి చేశారు. అయితే 2019లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో మిగిలిన పనులకు గ్రహణం పట్టింది.

అన్ని వసతులతో స్టేడియం

వైసీపీ అధికారం కోల్పోయి టీడీపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడటంతో ఇండోర్ స్టేడియానికి మంచి రోజులు వచ్చినట్లైంది. ఇటీవలే అన్ని హంగులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఇండోర్ స్టేడియం నిర్మించడంతో పాటు అవసరమైన క్రీడా సామగ్రిని సమకూర్చుతుండటంతో క్రీడాకారులకు ప్రతిభను చాటు కునేందుకు మంచి అవకాశం ఏర్పడింది. చెస్, క్యారమ్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో సత్తా చాటే అవకాశం కలుగుతోంది.దీనిపై పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ఈ నెలలో ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి మడకశిరకు వస్తున్నారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మడకశిరలో మాదిరే నియోజకవర్గంలో మిగిలిన మండలాల్లో కూడా ఇండోర్ స్టేడియంలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎ్‌సరాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంత్రిని కోరనున్నట్లు సమాచారం.


మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి



గ్రామీణ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందాలంటే మండల కేంద్రాల్లో ఇండోర్ స్టేడియాలు నిర్మించాలి. మంత్రి మడకశిరలో పర్యటించనున్న నేపథ్యంలో అమరాపురంలో కూడా ఇండోర్ స్టేడియం నిర్మించే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారు.

\- రంగారెడ్డి, అమరాపురం

ఎంతో మేలు



ప్రభుత్వం మడకశిరలో ఇండోర్ స్టేడియం నిర్మించడంతో ఈ ప్రాంత క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే క్రీడా నైపుణ్యం చాటుకుని మంచి భవిష్యత్తును రూపొందించుకుంటారు. మడకశిరలో ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను చూపేందుకు ఇండోర్ స్టేడియం ఒక అవకాశం. విశాలమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి కోర్టును ఏర్పాటు చేస్తే ఎంతో మంది క్రీడాకారులకు అనుకూలంగా ఉంటుంది.

-నవీద్, మడకశిర

అపరిశుభ్రతకు కేరాఫ్ మోరుబాగల్

\- పట్టించుకోని అధికారులు



నాచేపల్లిలో నిండుకున్న మురుగు కాలువ



తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

గుడిబండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర పథకంలో భాగంగా ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. గుడిబండ మండలం మోరుబాగల్ గ్రామ పంచాయతీలో మోరుబాగల్, వీరజ్జనపల్లి, నాచేపల్లి గ్రామాలు ఉన్నాయి. అయితే గ్రామాల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో అధ్వానంగా ఉంటున్నాయి. డ్రైనేజీలు పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతోపాటు ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇంటి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయినా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. నీటి ట్యాంకుల చుట్టూ కూడా అపరిశుభ్రత నెలకొందని పంచాయతీ పాలకవర్గం గ్రామాల్లో అపరిశుభ్రత తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత పాటించాలనే ఆదేశాలు ఉన్నా పంచాయతీ అధికారులు వాటిని బేఖాతరు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మోరుబాగల్ పంచాయతీలో పేరుకుపోయిన అపరిశుభ్రతను తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రతను తొలగిస్తాం..

మండలంలోని పంచాయతీ గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని పంచాయతీ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు తెలియజేశాం. వెంటనే పంచాయతీ గ్రామాల్లోని డ్రైనేజీలను శుభ్రం చేసి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడతాం.

-నాగరాజునాయక్, ఈఓఆర్డీ

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నారాయణ సేవలో భాగంగా ఆదివారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సత్యసాయి బాబా చిత్రపటానికి పూజలుచేసి, భజనలు చేశారు. అనంతరం ఆదివారం సంతకు వచ్చిన గ్రామీణులు, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ శంకర్‌తోపాటు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పలు దుకాణాల్లో చోరీ



బ్లూబాస్కెట్ సూపర్ మార్కెట్‌లో చోరీ చేస్తున్న దొంగ సీసీ టీవీ ఫుటేజీ

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని పరిగి-హిందూపురం ప్రధాన రహదారిలో శనివారం అర్ధరాత్రి అయ్యంగార్ బేకరీలో షెట్టర్ ధ్వంసం చేసి, లోపలికి ప్రవేశించి నగదు అపహరించుకెళ్లారు. హిందూపురం-మధుగిరి రోడ్డులో బ్లూబాస్కెట్, ప్రకృతి మార్ట్ మినీ సూపర్ మార్కెట్లలో షెట్టర్ పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు. బ్లూబాస్కెట్ సూపర్‌మార్కెట్‌లో రూ.15వేలు నగదు దోచుకెళ్లినట్లు షాపు యజమాని బాలు తెలిపాడు. చోరీలపై పరిగి పోలీస్ స్టేషన్‌లో దుకాణదారులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగడు యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు గోరంట్ల మండల మీట్

గోరంట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ సర్వసభ్యసమావేశం మంగళవారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలన్నారు. సభ్యుల తరుపున ఇతరులు, బంధువుల అనుమతి లేదని అజెండాలో ప్రత్యేకంగా పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లికి చెందిన యువకుడు వెంకటేష్ క్రిమిసంహారక మందు తాగి ఆదివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఆదినారాయణ కుమారుడైన వెంకటేష్ బూదిలి సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నారు. పంటలకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురైయ్యారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. వెంటనే అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడి మృతి

మడకశిరటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే రామాంజనేయులు ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని వడ్రపాళ్యం గ్రామంలోగల బంధువుల ఇంట్లో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. గుండెపోటుతో చనిపోయాడు. రామాంజనేయులు మృతి విషయం తెలుసుకొన్న ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగులప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సాకే గోవింద్, మహిళా అధ్యక్షురాలు గుజ్జాల, ముత్యాలమ్మ, మడకశిర అధ్యక్షురాలు నిర్మల, కార్యదర్శి అనురాధమ్మ, సాకే నాగార్జున సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు గ్రామ వాసి బోయ హరి(27) కడుపునొప్పి తాళలేక శనివారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సంవత్సరం క్రితం అతడి భార్య శిరీష హరితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ గొర్రెలు, ఆవులను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది కాలంగా అతనికి కడుపునొప్పి తీవ్రమైంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరి మృతదేహాన్ని పోలీసులు ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. హరి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లి గ్రామంలో శనివారం రాత్రి అనిత ఇంట్లో విద్యుదాఘాతం జరిగింది. ఇంట్లో ఉన్న రూ. లక్ష విలువైన సామగ్రి కాలిపోయింది. అనిత మాట్లాడుతూ.. శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి.. బయటకు వెళ్లానని.. ఆ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని వాపోయారు. చుట్టుపక్కన వాళ్లు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారన్నారు. అయితే అప్పటికే ఇంట్లోని ఫ్రిడ్జ్, టీవీ, ఫ్యాన్లు, వంటసామగ్రి, సామాన్లు, బట్టలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు పునరావాసం కల్పించి కుటుంబ జీవనానికి నిత్యావసర వస్తువులు అందించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

అన్యాయంగా కేసులు కట్టారు..

ఎస్ఐ ఎదుట బాధితుల ఆవేదన



బాధితులతో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రమేష్

సోమందేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివానగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో తమపై అన్యాయంగా కేసులు నమోదుచేశారంటూ గాజుల ఆంజనేయులు, కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం సాయంత్రం దాదాపు వంద మంది పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఐ రమేష్‌ను కలిసి తమగోడును వెల్లబోసుకున్నారు. కుక్కపిల్ల విషయంలో పోతుల కిష్టప్ప కుటుంబ సభ్యులు, బోయగంగాధర్, అజయ్‌తో పాటు మరికొంతమంది తమపై కర్రలు, రాళ్లతో దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయన్నారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న సందర్భంలో పోలీసులు తమ నుంచి వివరాలు సేకరించారన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తాము అనంతపురం వెళ్లామన్నారు. తీరాచూస్తే గాయపడిన తన కుటుంబ సభ్యులు తొమ్మిదిమందిపై అలాగే తమపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసిందన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాల ఆధారంగా కేసును నమోదు చేయాలని కోరారు. కాగా సంఘటన జరిగిన సమయంలో తాను రామగిరిలో బందోబస్తు నిర్వహిస్తున్నానని, పూర్తిస్థాయిలో కేసును విచారించి దాని ఆధారంగా కేసులను నమోదు చేస్తామని ఎస్ఐ రమేష్ వారికి హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ మార్గంలో నడవాలి

\- కౌన్సిలర్ అంజలి



దీపాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు ఆదివారం దీపాలు వెలిగించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని 11వ వార్డు బీజేపి కౌన్సిలర్ అంజలీ కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుభ్రం చేసి దీపాలు వెలిగించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌రెడ్డి, మేడకుర్తి హరి, అమర్‌దేవేంద్ర, మహిళా మోర్చ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, నాయకులు మహాలక్ష్మీ, భారతి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలపై పోరాటం: పీడీఎస్‌యూ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ప్రభుత్వ విద్యాలయాలతోనే విద్యార్థులకు మేలు జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, జిల్లా కార్యదర్శి బాబావలి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యూ) నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు పీడీఎస్‌యూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జై చంద్ర, అజయ్, సంతోష్, నరేష్, రాజు, భగత్, హుసేన్, నందీష్ తదితరులు ఉన్నారు.

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సంతకల సేకరణ ఆదివారం చేపట్టారు. గ్యాస్, డీజిల్ ధరల పెరడంతో మధ్యతరగతి ప్రజలపై ప్రభావం చూపుతోందన్నారు. పెంచిన ధరలు తగ్గించాలని మూడు వందలమంది సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, స్వర్ణలత, ఆంజనేయులు, హబీబ్, సుభాష్, మహమ్మద్‌రఫీక్, లోకేష్, కృష్ణారావు, నంజుడప్ప తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ఆటో డ్రైవర్‌కు సూచనలిస్తున్న పోలీసులు

పరిగి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటోలను ఆదివారం ఎస్ఐ రంగడు యాదవ్ తనిఖీ చేశారు. అధికలోడు, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను, వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ తదితర వాటిని పరిశీలించారు. వాహనదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గార్మెంట్స్ పరిశ్రమలకు వెళ్లేటపుడు అధిక రద్దీతో రహదారి ఉంటుందని నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

హెంజేరు సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

అమరాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో నొళంబులు పాలించిన శైవ క్షేత్రం హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. ఉదయాన్నే వివిధ రకాల అభిషేకాలు, రుద్రాభిషేకం, కుంకుమాభిషేకం, తైలాభిషేకం నిర్వహించి సిద్దేశ్వర స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి వెండి కవచాలు ధరించి వచ్చిన భక్తులకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదాన్ని పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సిద్దలింగేశ్వర స్వామి, శివకుమార్‌స్వామి, రవి శంకర్, మహేశ్వర, గౌతమ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిఆంధ్రుని దీపోత్సవం



ఆదిఆంధ్రుని దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

సోమందేపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆదిఆంధ్రుని దీపోత్సవం వైభవంగా జరిగింది. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా ఊరి బయట ఉన్న ఆదిఆంధ్రుని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చిన దీపాన్ని రంగనాథ స్వామి ఆలయం ముందున్న దీపపు స్థంభంపై ఉంచారు. అనంతరం ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వం ఆదిఆంధ్రుని ఆలయంలో భక్తులు మూడు రోజులపాటు తపస్సుచేసి దీపాన్ని ఆర్పకుండా కాపాడటంతోపాటు మూడోరోజు ఆ దీపాన్ని తెచ్చి ఆలయం దీపం స్థంభంపై వెలిగించారన్నారు. ఆనాటి నుంచి ఆచారాన్ని కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. ఇలా దీపం వెలిగిస్తే సమృద్ధిగా పంటలు పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని ప్రజల విశ్వాసమన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కోలాటం ఆడుతూ దీపాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు ప్రదక్షిణలు చేస్తూ పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో యువకులు దీపపు స్థంభంపైకి ఎక్కి ఆదిఆంధ్రుని దీపాన్ని వెలిగించారు. భక్తులు రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరుకు చెందిన భక్తుడు బాలాజీ భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా మహావీరుడి జయంతి



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అమరాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఆదినాథ దిగంబర జైన మహావీర జయంతిని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయాన్నే వివిధ రకాల అభిషేకాలు, గంధాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించి ఆదినాథ దిగంబర జైన మహావీర విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పురవీధులలో ఊరేగించారు. ఈ ఉత్సవానికి సమీప కర్ణాటక రాష్ట్రం నుంచి జైన మతస్థులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల్ని అందజేశారు. కార్యక్రమంలో జైన ఆలయ కమిటీ సభ్యులు పద్మరాజ్‌జైన్, రాజుజైన్, అనంతజైన్, జె.పి.రాజుజైన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఈత మట్టలతో ర్యాలీగా వెళ్తున్న క్రైస్తవులు

మడకశిరటౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రైస్తవ సోదరులు ఘనంగా మట్టల ఆదివారం వేడుకలను జరుపుకొన్నారు. ఆదివారం స్థానిక సీఅండ్ఐజీఎం చర్చి నుండి ఈత మట్టలు చేతపట్టుకొని పాటలు పాడుతూ పట్టణంలో వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. చర్చి వరకు ర్యాలీ నిర్వహించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అనంతరం చర్చి మతపెద్దలు మట్టల ఆదివారం ప్రత్యేకత, యేసు ప్రభు జీవిత చరిత్రను క్రైస్తవ సోదరులకు చదివి వినిపించారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): స్థానిక బైబిల్ మిషన్‌చర్చిలో పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం క్రైస్తవులు ఈత పట్టలు పట్టుకుని చర్చికి వెళ్లారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ మట్టల పండగ విశిష్టతను వివరించారు.

నేటి నుంచి కనుమ మారెమ్మ జాతర

మడకశిర రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కనుమ మారెమ్మ జాతర మహోత్సవాలను సోమవారం నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ పేర్కొంది. సోమవారం కనుమమారెమ్మను కనుమ నుంచి మడకశిరలోని కొల్లాపురమ్మదేవి ఆలయం వద్దకు తీసుకువచ్చి రాత్రి జలధి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 15న మంగళవారం అమ్మవారికి జ్యోతుల ఉత్సవం, 16 పోతులరాజు కార్యక్రమం, 17, 18 తేదీల్లో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. 19న కనుమ మారెమ్మకు వీడుకోలు ఉత్సవం ఉంటుందని, భక్తులు పెద్దఎత్తున హాజరుకావాలని ఆలయ కమిటీ పేర్కొంది.